

కన్వీనర్ల జాబితాలు నేడు అందజేయాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి గ్రామ సచివాలయానికి ఎంపిక చేసిన ముగ్గురు కన్వీనర్ల జాబితాలను సోమవారం సాయంత్రానికి పార్టీ జిల్లా కార్యాలయానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ముగ్గురు కన్వీనర్లలో కనీసం ఒక మహిళ విధిగా ఉండాలని స్పష్టం చేశారు. ఆయా నియోజకవర్గ ఎమ్మెల్యేలు, పార్టీ సమన్వయకర్తలు అందజేసే జాబితాలను కేంద్ర కార్యాలయానికి పంపించాల్సి ఉందని తెలిపారు. పార్టీ కార్యాలయ మేనేజర్ ఫోన్ నంబరు 9100926472కు వాట్సాప్ ద్వారా కూడా జాబితాలను పంపించవచ్చని పేర్కొన్నారు. పార్టీపై విధేయత, క్రమశిక్షణ, అంకితభావంతో పనిచేసే (స్మార్ట్ ఫోన్ కలిగి ఉన్న) వారిని ఎంపిక చేసేలా చూసుకోవాలని తెలిపారు.

బ్లాక్ మార్కెట్‌కు రేషన్ బియ్యం

జిల్లాలో రేషన్ బియ్యమే కొందరికి వ్యాపార సరుకుగా మారిపోయింది. బియ్యం అవసరం లేని వారి నుంచి చౌకగా కొనుగోలు చేసి, ఇతర ప్రాంతాలకు రవాణా చేస్తున్నారు. విజిలెన్స్ అధికారులు అడపాదడపా రేషన్ బియ్యం, వాహనాలను స్వాధీనం చేసుకుంటున్నా, అక్రమ రవాణాను నిలువరించలేకపోతున్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో పలుచోట్ల టన్నుల కొద్దీ బియ్యం పట్టుబడడం జిల్లాలో పరిస్థితికి అద్దం పడుతోంది. స్థానికుల నుంచి ఫిర్యాదులు వస్తేనే అధికారులు స్పందిస్తుండడంతో కొన్నిచోట్లే వెలుగు చూస్తున్నాయి. సాధారణ రోజుల్లో అధికారులు తనిఖీలు నిర్వహించకపోవడంతో యథేచ్ఛగా వ్యాపారం సాగుతోంది.

- జిల్లాలో పలుచోట్ల పట్టుబడుతున్న బియ్యం నిల్వలు
- ఫిర్యాదులు వస్తేనే స్పందిస్తున్న అధికారులు
- సాధారణ రోజుల్లో అంతంతమాత్రంగానే తనిఖీలు
- యథేచ్ఛగా సాగుతున్న బియ్యం అక్రమ రవాణ



పలాసలో పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్న అధికారులు (ఫైల్)

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్స్ (ఎండియు) ద్వారా ప్రభుత్వం జిల్లాలో ప్రతి నెలా సుమారు 6.58 లక్షల మందికి బియ్యంతో పాటు కందిపప్పు, పంచదార అందిస్తోంది. వీరిలో రేషన్ బియ్యం అవసరం లేని వారిని వ్యాపారులు గుర్తించి, వారి నుంచి బియ్యం కొనుగోలు చేస్తున్నారు. గ్రామాలు, పట్టణాల్లోని వీధుల్లో చిన్న చిన్న కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్న చిరు వ్యాపారులు కొందరు చౌక ధరల దుకాణాలు అందిస్తున్న బియ్యాన్ని కేజీ రూ.14 నుంచి రూ.15 మధ్య కొనుగోలు చేస్తున్నట్లు తెలుస్తోంది. వాలంటీర్లే వారి వేలిముద్రలు వేసి బియ్యం అందించినట్లుగా లెక్క చూపి, అలా మిగిలిన బియ్యాన్నీ కొనుగోలు చేస్తున్న సందర్భాలు గతంలో వెలుగు చూశాయి. లబ్ధిదారులకు కొంత సరుకు పంపిణీ చేయగా ఎండియు వాహనాలు, రేషన్ దుకాణాల్లో మిగిలిన బియ్యాన్నీ వ్యాపారులు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నట్లు తెలుస్తోంది. అలా పెద్దఎత్తున బియ్యాన్ని నిల్వ చేస్తున్న క్రమంలో అధికారులకు పట్టుబడుతున్నారు. గ్రామాల్లో, వీధుల్లోని చిల్లర దుకాణాలు రూ.14 నుంచి రూ.15 మధ్య కొనుగోలు చేస్తుంటే, వాటిని పెద్ద వ్యాపారులు రూ.20 వరకు చెల్లించి కొంటున్నారు.

విజిలెన్స్ దాడులు

సరుబుజ్జిలి మండలం చిన్నకాగితాపల్లిలో ఈనెల 20వ తేదీన ఒక ఇంటిపై విజిలెన్స్ అధికారులు దాడి చేసి 11.50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నారు. ఆమదాలవలస మున్సిపాల్టీలో గత నెల 26న పాత గోనె సంచుల వ్యాపారం చేస్తున్న పొట్నూరు రామారావు నిల్వ ఉంచిన 12 టన్నుల బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు కేసులు నమోదు చేస్తున్నా, జిల్లాలో ఏదో ఒక చోట బియ్యం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడుతున్నారు.

బియ్యం నిల్వలపై తనిఖీలేవి?

బియ్యంతో పట్టుబడిన వ్యక్తులకు రైసు మిల్లు ఉంటే పౌర సరఫరాల సంస్థ ధాన్యం మర ఆడించేందుకు ఇచ్చినట్లుగా అనుకోవచ్చు. కనీసం బియ్యం వ్యాపారం చేస్తున్నా అంత పెద్ద మొత్తంలో నిల్వ ఉంచినా అర్థముంది. కానీ టన్నుల కొద్దీ బియ్యం నిల్వ ఉంచడం అనేక అనుమానాలకు దారితీస్తోంది. జిల్లాలోని పలుచోట్ల ఈ దందా సాగుతోంది. రెవెన్యూ, పౌర సరఫరాల శాఖ అధికారులకు ఫిర్యాదులు వస్తేనే స్పందిస్తున్నారు తప్ప ఇతర సందర్భాల్లో స్పందించడం లేదు. రైస్‌మిల్లులు, బియ్యం వ్యాపారుల దుకాణాల్లోనూ తనిఖీలు పెద్దగా చేపట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కాకినాడ పోర్టుకు రేషన్ బియ్యం?

జిల్లాలో వ్యాపారులు కొనుగోలు చేస్తున్న రేషన్ బియ్యం కాకినాడ పోర్టుకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్కడ నుంచి షిప్‌ల ద్వారా విదేశాలకు వెళ్తున్నట్లు గతంలో అనేక వార్తలు వచ్చాయి. ప్రధానంగా ఆఫ్రికన్ దేశాలకు తరలిపోతున్నట్లు తెలుస్తోంది. అక్కడ కిలో రూ.50 నుంచి రూ.60 వరకు అమ్ముడుపోతున్నట్లు రైస్‌మిల్లర్ల మాటల్లో వ్యక్తమవుతోంది.



శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేస్తున్న టోల్‌ప్లాజా కార్మికులు

టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఎచ్చెర్ల

చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం చిలకపాలెం టోల్‌ప్లాజాలో 15 ఏళ్లుగా పనిచేస్తున్న 106 మంది కార్మికులను మడపాం, నాతవలస టోల్‌ప్లాజాల్లో ఉద్యోగాలు కల్పించాలని, గ్రాట్యూటీ, నష్టపరిహారం వెంటనే చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యాన చిలకపాలెం టోల్‌ప్లాజా కార్మికులు శనివారం రాత్రి శ్రీనివాసరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిలకపాలెం టోల్‌ప్లాజా ఎత్తివేసి ఇక్కడి ఆదాయం నాతవలస, మడపాం టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసిన నేషనల్ హైవే అధికారులు, 15 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న కార్మికులను రోడ్డున పడేయడం అన్యాయమన్నారు. వారిని టోల్‌ప్లాజాల్లో సర్దుబాటు చేసి విధుల్లో కొనసాగించాలని, గ్రాట్యూటీ, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. రోడ్డున పడిన టోల్‌ప్లాజా కార్మికులను ఆదుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రికి లేఖ రాస్తానన్నారు. కార్మికులకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధాంతరంగా రోడ్డున పడేస్తే వారి కుటుంబాలు ఏ విధంగా బతకాలని ప్రశ్నించారు. దేశం కోసం సరిహద్దుల్లో కాపలా కాసిన మాజీ సైనికులపై ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సమంజసం కాదన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటానికి సిపిఎం అండగా ఉంటుందని భరోసానిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.తులసీదాస్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, చిలకపాలెం టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు వి.వెంకటరమణ, పి.శ్రీనివాసరావు, వి.రవిబాబు, కె.ఏడుకొండలు, పి.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌టి కమిషన్ సభ్యుడు అనంత నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న వాబ యోగి

గ్రామాల్లో ఎస్‌టి కమిషన్ పర్యటన

ప్రజాశక్తి - సోంపేట

సోంపేట, కంచిలి, ఇచ్ఛాపురం మండలాల పరిధిలో బెంతు ఒరియా సామాజిక తరగతి ప్రజలు నివసిస్తున్న గ్రామాల్లో జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యులు అనంత నాయక్ ఆదివారం పర్యటించారు. ఈ ప్రాంతాల్లో నివసిస్తున్న బెంతూ ఒరియాలను ఎస్‌టి జాబితాలో చేర్చాలని గతంలో వచ్చిన వినతులపై కేంద్ర ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను నియమించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో అనంత నాయక్ ఐటిడిఎ పిఒ నవ్య, పలాస ఆర్‌డిఒ సీతారామ్మూర్తి, తహశీల్దార్ రమేష్‌బాబుతో కలిసి పలు గ్రామాల్లో పర్యటించి వారి స్థితిగతులను తెలుసుకున్నారు. ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయకపోవడంతో తమ బిడ్డల భవిష్యత్ నాశనమవుతోందని బెంతు ఒరియా సంఘ నాయకులు డాక్టర్ జగబందు దొలాయి, దేవరాజ్ సాహూ తదితరులు కమిషన్ ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

సోంపేట తహశీల్దార్ కార్యాలయంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వాబ యోగి, తరనీ నాయక్, పురేంద్ర సభరో, సవర రాంబాబు తదితరులు అనంత్ నాయక్‌ను కలిశారు. జిల్లాలో బెంతు ఒరియాలు లేరని, బెంతు ఒరియాలుగా చెప్పుకుంటున్న వారందూ వడ్డి సామాజిక తరగతికి చెందిన వారని వివరించారు. వారిని ఎస్‌టి జాబితాలో చేర్చవద్దని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఇచ్చిన మామిడి మొక్కను తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో ఎస్‌టి కమిషన్ సభ్యుడు అనంత్ నాయక్, ఐటిడిఎ పిఒ నవ్య నాటారు.

సందడిగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను ఆదివారం సందడిగా నిర్వహించారు. శనివారం అర్ధరాత్రి నుంచే చర్చిల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. ఏసుక్రీస్తును స్తుతిస్తూ గీతాలను ఆలపించారు. శ్రీకాకుళం చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి, ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్, కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చి, డగ్లస్ స్కూల్ క్యాంపస్‌లోని కీన్‌స్టోన్ చర్చి, పాత శ్రీకాకుళంలోని రార్డ్ అసెంబ్లీ చర్చి, పురుషుల డిగ్రీ కళాశాల సమీపంలోని సహాయ మాత (ఆర్‌సిఎం) చర్చి, టౌన్‌హాల్ వద్ద సెయింట్ థామస్ చర్చితో పాటు జిల్లావ్యాప్తంగా పలు చర్చిల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలాసలోని చర్చిలో రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు పాల్గొని కేక్‌ను కట్ చేశారు. క్రైస్తవ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. పాస్టర్లు క్రీస్తు సందేశం చదివి వినిపించారు. పలుచోట్ల పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.



క్రిస్మస్ సంబరాల్లో పాల్గొన్న చిన్నారులు

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

ఎస్‌పి జి.ఆర్ రాధిక

శ్రీకాకుళం: బాధిత పోలీసు కుటుంబాలకు అండగా ఉంటామని ఎస్‌పి జి.ఆర్ రాధిక భరోసానిచ్చారు. ఇటీవల విధి నిర్వహణలో అనారోగ్యంతో మృతి చెందిన కానిస్టేబుల్ రొక్కం దినేష్ సతీమణి కె.పావని కుమారి, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పి.జోగారావు సతీమణి లక్ష్మికి అడిషనల్ కార్పస్ ఫండ్ కింద రూ.లక్ష చొప్పున చెక్కులను జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ సేవలు అందించి, విధి నిర్వహణలో పలు కారణాలతో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. సంక్షేమం, ప్రభుత్వపరంగా కుటుంబసభ్యులకు రావాల్సిన ప్రయోజనాలను త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు.



చెక్కును అందజేస్తున్న ఎస్‌పి రాధిక

రాక్షస పాలనను అంతమొందించాలి

టిడిపి జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్

ప్రజాశక్తి - బూర్జ

రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కూన రవికుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని పలుకుపర్తిలో పరామర్శలకు ఆదివారం వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసిపి ప్రభుత్వ నిరంకుశ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. కొత్త పెన్షన్లు ఇవ్వకుండా ఉన్న పాత పెన్షన్‌ను తొలగించడం ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. సమస్యలపై ప్రశ్నిస్తే వేధిస్తున్నారని, అడిగితే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు, ప్రజలపై మోపిన భారాలను బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రజా కంటక పాలన పోవాలంటే వచ్చే ఎన్నికల్లో వైసిపిని గద్దె దింపాలన్నారు. ప్రజా సంక్షేమ పాలన కోసం తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో పాటుపడాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట జెడ్‌పిటిసి మాజీ సభ్యులు రామకృష్ణ, టిడిపి నాయకులు శ్రీనివాసరావు, హరిబాబు తదితరులున్నారు.



పరామర్శిస్తున్న కూన రవికుమార్

అక్రమ గృహ నిర్బంధం తగదు

సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

భావనపాడు పోర్టు బలవంతపు భూసేకరణను వ్యతిరేకించిన సంతబొమ్మాళి మండలం మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావును అక్రమంగా గృహ నిర్బంధం చేయడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవరి కృష్ణమూర్తి ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని పేర్కొన్నారు. పోర్టు భూసేకరణకు రైతులు స్వచ్ఛందంగా సహకరిస్తున్నారని అబద్ధపు ప్రచారం చేస్తూ, మరోవైపు గృహ నిర్బంధాలతో ఎందుకు బెదిరిస్తున్నారని ప్రశ్నించారు. భావనపాడు పోర్టు పేరుతో మూలపేట తదితర గ్రామాల్లో భూములను నిర్బంధంగా సేకరించడాన్ని, ప్రభుత్వ దమనకాండను ఆపాలని డిమాండ్ చేశారు. రైతుల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు. రైతులను నిర్బంధించడాన్ని రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు తీవ్రంగా ఖండించారు.

కోవిడ్ నాలుగో దశపై భయం వద్దు

- మాస్కు ధరించడం, భౌతిక దూరం తప్పనిసరి
- సీజనల్ వ్యాధులపై దృష్టి
- ఇంటింటికీ వైద్యంపై ప్రత్యేక శ్రద్ధ
- జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్



కోవిడ్ నాలుగో దశ ఒమిక్రాన్, కొత్త వేరియంట్లపై ప్రజలు భయాందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. కోవిడ్‌పై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది. కోవిడ్ పరీక్షలు, పడకలు, వైద్యం, ఆక్సిజన్ సదుపాయం వంటివాటిపై చర్యలు చేపడుతున్నాం. వాక్సినేషన్ పూర్తి చేయడం వల్ల కొంత వరకు కోవిడ్ బారిన పడకుండా ఉన్నాం. ప్రజల్లో నిర్లక్ష్యం ఉంది. కోవిడ్ వ్యాప్తి చెందకుండా మాస్కులు తప్పని సరిగా ధరించాలి. చేతులు శుభ్రం చేసుకోవాలి. కోవిడ్ నియంత్రణ, సీజనల్ వ్యాధులు వ్యాప్తి కాకుండా నివారణ చర్యలు, ఇంటింటికీ వైద్య సేవలు, తదితర విషయాలను ఆమె ప్రజాశక్తి ముఖాముఖిలో వివరించారు.



జిల్లాలో కోవిడ్ నియంత్రణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?

జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో 80 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వాటి పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాల్లో కోవిడ్ పరీక్షలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. జిల్లాలో ఇప్పటికే శతశాతం వాక్సినేషన్, బూస్టర్ డోస్ వాక్సినేషన్ పూర్తయింది. చైనా, ఇతర దేశాల్లో కోవిడ్ వ్యాప్తి నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. కొత్త వేరియంట్ జిల్లాలో ప్రబలకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్రిస్మస్, న్యూఇయర్, సంక్రాంతికి వివిధ దేశాల నుంచి జిల్లాకు రాకపోకలపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ కొనసాగుతోంది. కోవిడ్ ప్రభావిత ప్రాంతాల నుంచి వస్తున్న వారి వివరాలు సేకరించడం జరుగుతోంది.

కోవిడ్ పరీక్షా కేంద్రాల నిర్వాహణ ఎలా కొనసాగుతోంది?

జిల్లాలో కోవిడ్ పరీక్షల నిర్వాహణ నిరంతర ప్రక్రియ. జిల్లా కేంద్రంలో పరీక్షా కేంద్రాన్ని కొనసాగించడం జరుగుతోంది. జిల్లా వ్యాప్తంగా ఉన్న సచివాలయాల పరిధిలో పరీక్షలు నిర్వహించుకునేందుకు వీలుంది. అవసరమైనప్పుడు ఎఎన్‌ఎంల వద్ద పరీక్షల కిట్లు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం. జ్వరపీడితులను గుర్తించడం నిరంతరం జరుగుతోంది. సచివాలయాల పరిదిలో ఫీవర్ సర్వే కొనసాగుతోంది. క్షేత్రస్థాయిలో ఆశ కార్యకర్తలు, ఎఎన్‌ఎంలు, మగ ఆరోగ్య కార్యకర్తలు శ్రమిస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో కోవిడ్ అదుపులోనే ఉంది. కానీ సీజన్ వల్ల జలుబు, దగ్గు, జ్వరం వంటి లక్షణాల్లో ఎక్కువగా ఉంటాయి. మంచు, శీతల వాతావరణం వల్ల ఈ పరిస్థితి ఉంది. అవసరమైన వారికి కోవిడ్ పరీక్షలు నిర్వహిస్తున్నాం.

సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రభలకుండా అన్ని రకాలైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. క్షేత్ర స్థాయిలో ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు వ్యాధులు ప్రభలడానికి కారణాలను గుర్తించి సంరక్షణా చర్యలు చేపడుతున్నాం. జిల్లాలో దోమల బెడద అధికంగా ఉంటోంది. పరిసరాల పరిశుభ్రతలేని కారణంగా వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. వీటివల్ల ప్రధానంగా ప్రాణాంతక వ్యాధులైన మలేరియా, డెంగీ, సెరిబ్రల్ మలేరియా, ఫైలేరియా వంటి వ్యాధులు విజృంభిస్తున్నాయి. ఏటా దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

జిల్లాలో మలేరియా , డెంగీ , విష జ్వరాల పరిస్థితి ఎలా ఉంది?

జిల్లాలో ప్రస్తుతం సీజనల్ వ్యాధులు అదులోనే ఉన్నాయి. వాతవరణంలో వస్తున్న మార్పుల వల్ల జ్వరాలు పెరిగే అవకాశం ఉంది. ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలి. కాచి, వడపోసిన నీరు తాగడం, మితంగా తినడం, జ్వరం లక్షణాలు ఉన్నట్టు గుర్తిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించడం ద్వారా త్వరతిగతిన నయం చేసుకోవచ్చు. 2018 సంవత్సరం నుంచి మలేరియా, డెంగీ కేసులు తగ్గుముఖం పట్టాయి. డెంగీ 2018లో 87 కేసులు, 2019లో 164 కేసులు, 2020లో 23 కేసులు, 2021లో ఇప్పటివరకు 32 కేసులు నమోదయ్యాయి. మలేరియా 2018లో 264 కేసులు, 2019లో 125 కేసులు, 2020లో 34 కేసులు, 2021లో ఇప్పటివరకూ 234కేసులు నమోదయ్యాయి.

మందుల సరఫరా ఏ మేరకు చేపట్టారు?

సీజనల్ వ్యాధుల్లో ప్రధానంగా మలేరియాకు సంబంధించిన యాంటీ మలేరియా మందులు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల్లో సరిపడా నిల్వలు ఉన్నాయి. గ్రామాలు, పట్టణాల్లో పంచాయతీరాజ్ శాఖ, పురపాలక శాఖల సహకారంతో దోమల లార్వా నియంత్రణ చర్యలు చేపడుతున్నాం. డెంగీ వ్యాధి ఏడిస్ దోమల నుండి సంక్రమిస్తుంది. ఇంటి పరిసరాల్లో ఉండే చిన్ననీటి నిల్వల్లో ఉండి పగటిపూట ఈదోమలు సంచరిస్తుంటాయి. అందువల్ల పగటి వేళల్లో దోమలు కుట్టకుండా ఉండేందుకు పూర్తిగా వస్త్రధారణ తప్పనిసరి. డెంగీ నిర్ధారణ పరీక్షలు జిల్లా ఆస్పత్రితో పాటు టెక్కలి జిల్లా ఆస్పత్రిలోనూ చేయడం జరుగుతుంది. మలేరియా, డెంగ్యీ రాకుండా ముందస్తు నివారణ చర్యలు పాటించడం మేలు.

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి - ఆమదాలవలస

'ఉత్తరాంధ్ర వెనుక బాటుతనం-వాస్తవాలు' పుస్తకాన్ని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆవిష్కరించారు. మేధావుల సదస్సు సమగ్ర నివేదికను అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం-వాస్తవాలు పేరిట పుస్తక రూపంలో తీసుకొచ్చింది. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ఉత్తరాంధ్ర వెనుకబాటుతనాన్ని పారదోలడానికి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ ప్రాంతానికి చెందిన సాగునీటి ప్రాజెక్టులు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి ప్రాజెక్టు అతి త్వరలో పూర్తి కాబోతున్నాయని తెలిపారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే ఈ ప్రాంతం సస్యశ్యామలం అవుతుందన్నారు. పరిపాలనా వికేంద్రీకరణ మేరకు విశాఖ రాజధాని ద్వారా ఉత్తరాంధ్ర వెనుకబాటుతనం పోతుందని అభిప్రాయపడ్డారు. పరిపాలనా వికేంద్రీకరణను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సంఘ సభ్యులను కోరారు. కార్యక్రమంలో అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బొడ్డేపల్లి దామోదరరావు, రాష్ట్ర కార్యదర్శి సనపల అన్నాజీరావు, జిల్లా అధ్యక్షులు కాపల వెంకటరావు, జిల్లా గౌరవాధ్యక్షులు తేజ మోహనరావు, విశాఖ జిల్లా అధ్యక్షులు పి.మల్లేశ్వరరావు, కార్యదర్శి డి.ఎస్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



క్రీడాకారులతో సూర శ్రీను

క్రీడల్లో జిల్లా ఖ్యాతిని పెంచాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనే క్రీడాకారులు విజేతలకు నిలిచి జిల్లా ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పాలని సామాజికవేత్త, ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు సూర శ్రీనివాసరావు అన్నారు. ఎచ్చెర్ల పోలీస్ క్వార్టర్స్ మైదానంలో ఆదివారం నిర్వహించిన అండర్-14 బాలబాలికలు క్రీడాకారులను అభినందించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాస్థాయి నుంచి జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని దక్కించుకునేందుకు క్రీడాకారులు శ్రమించాలన్నారు. క్రీడాకారులకు తనవంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తానని చెప్పారు. పిల్లల్లో మంచి క్రమశిక్షణ అలవాటు పడేలా చేసిన ఇంటలిజెన్స్ ఎస్ఐ తారకేష్‌ను సూర శ్రీను అభినందించారు. ఎస్ఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన పేద ప్రజలకు అనేక సేవలు అందిస్తున్న సూర శ్రీనును మైదానం కోచ్‌లు, క్రీడాకారులు దుశ్శాలువ కప్పి సన్మానించారు.



జ్ఞాపికను స్వీకరిస్తున్న పిఒ విష్ణుచరణ్

అరసవల్లి సందర్శన

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయాన్ని పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం సందర్శించారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఆలయంలో స్వామి వారికి నిర్వహించే పలు సేవల్లో పాల్గొన్నారు. అనంతరం అనివేటి మండపంలో ఆయనకు స్వామివారి శేష వస్త్రాలను కప్పి జ్ఞాపికను ఆలయ ఇఒ వి.హరిసూర్యప్రకాష్ అందజేశారు. ఆలయ సూపరింటెండెంట్ కె.వెంకటేశ్వరరావు, బి.ఎస్.చక్రవర్తి పాల్గొన్నారు.

రూ.3.45 లక్షల ఆదాయం

పుష్యమాసం కావడంతో సూర్యనారాయణస్వామి ఆలయానికి సాధారణ రద్దీ కొనసాగింది. దీంతో ఒక్క రోజులో రూ.3.45 లక్షల మేర ఆదాయం సమకూరింది. టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.91,500లు, విరాళాల రూపంలో రూ.1,03,899లు, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1,50,000 ఆదాయం సమకూరినట్టు ఇఒ హరిసూర్యప్రకాష్ తెలిపారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

నందిగాం: మండలంలో బడగాం మాజీ ఎంపిటిసి లవునిపల్లి ఆరుద్రమ్మ, పెద్దబాణపురంలో రంకు ఎర్రప్ప, సుభద్రాపురంలో ఎర్ర జగదీశ్వరరావు మృతి చెందారు. వారి కుటుంబాలను కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి ఆదివారం పరామర్శించారు. వారితోపాటు పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణారావు, వైస్ ఎంపిపి సువ్వారి వసంత్, నందిగాం ఎంపిటిసి అంబోడి విష్ణు, సర్పంచ్‌లు కె.శాంతారావు, జడ్యాడ జయరాం, బి.సోమేశ్వరరావు, బలగ భీమారావు, ఆర్.ఢిల్లేశ్వరరావు, గడ్డయ్య, బి.షణ్ముఖరావు, బి.విశ్వనాథం పాల్గొన్నారు.



బడగాంలో మృతుని కుటుంబాన్ని పరామర్శిస్తున్న తిలక్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

జిల్లాలోని అన్ని చర్చిల్లో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. పలుచోట్ల అన్నదానాలు, వస్త్ర దానం నిర్వహించారు.

పలాస : మండలంలోని పాత్రియలో సీయోను గ్రేస్ చర్చిలో పాస్టర్ సవర జగన్నాయకులు ఆధ్వర్యాన నిర్వహించి క్రిస్మస్ వేడుకలో మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పాల్గొన్నారు. అనంతరం 2023 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు చింతాడ మాధవరావు, మందస ఎంపిపి డొక్కరి దానయ్య, కార్యక్రమంలో పాత్రియ వైసిపి నాయకులు ఉంగ సాయికృష్ణ, తర్లకోట సర్పంచ్ కొర్ల సంతోష్, అల్లుకోల సర్పంచ్ ప్రతినిధి దువ్వాడ రవికుమార్, విశ్వాసులు, ఎఐఎఇఎఫ్ మండల అధ్యక్షులు పి.ఈశ్వరరావు, సంఘం కమిటీ సభ్యులు సవర కేశవరావు, వైస్ సంఘ కాపరి సురేష్, సవర కిరణ్, సవర సంజీవ్, సవర గున్నయ్య, సవర క్రాంతి, సవర శేఖర్ పాల్గొన్నారు.

జలుమూరు: మండలంలోని పాగోడు క్రీస్తు ప్రార్థన మందిరంలో పాస్టర్ ఎల్.ఒనేసిము ఆధ్వర్యాన నిర్వహిస్తున్న క్రీస్తు సంబరాల్లో వైసిపి రాష్ట్ర సిఇసి మెంబర్ ధర్మాన పద్మప్రియ పాల్గొని కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం 50 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. టి.లింగాలపాడు క్రీస్తు ప్రార్థనా మందిరంలో పాస్టర్ రవిబాబు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో జలుమూరు పిహెచ్‌సి వైద్యాధికారి చల్ల వంశి పాల్గొని పేదలకు దుస్తులను అందజేశారు. తల్లిదండ్రులు లేని పిల్లలకు బ్యాగులు, టోపీలు పంపిణీ చేశారు. చిన్నారులకు బహుమతులు అందజేశారు. సేవా కార్యక్రమాలు నిర్వహించిన 70 మందికి అవార్డులు అందజేశారు. ముందుగా కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆమదాలవలస : పట్టణంలోని కృష్ణాపురం పరిధిలో ఉన్న గ్రేస్ గాస్పల్ చర్చిలో పాస్టర్ జి.శామ్యూల్ వరం ఏసుక్రీస్తు పుట్టుకను గురించి బోధించారు. గ్రేస్ గాస్పల్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ పాస్టర్ జి.కృపావరం పేదలకు దుస్తులను పంపిణీ చేశారు. అలాగే చిన్నారులకు బహుమతులను అందజేశారు. అనంతరం కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కోనాడ జగన్నాథరావు, బోర చిన్నంనాయుడు, జె.కె.వెంకటేశ్వరరావు, డాక్టర్ పి.తాతయ్యలు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని తామాడలో బేతెస్థ బిలీవర్స్ చర్చ్‌లో ఫాస్టర్ ఏసుదాసు బైబిల్‌లోని ఏసుప్రభు సందేశాలు వివరించారు. అనంతరం కొవ్వొత్తులను వెలిగించి ప్రార్థనలు చేశారు. కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టి భాకాంక్షలు తెలిపారు. చిన్నారులు చేసిన డాన్స్‌లు అందరికీ ఆకట్టుకున్నాయి.

మెళియాపుట్టి: క్రిస్మస్ పండగ సందర్భంగా నియోజకవర్గంలోని పలు చర్చిల్లో నిర్వహించిన వేడుకల్లో సామాజిక వేత్త, టిడిపి నాయకులు మామిడి గోవిందరావు (ఎంజి.ఆర్) పాల్గొన్నారు. ఈ మేరకు కేకలను కట్ చేసి క్రిస్మస్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎల్ఎన్‌పేట మండలం తురకపేటలో చర్చి అభివృద్ధికి రూ.పది వేలును టి.వి రమణకు, హిరమండలం మండలం బ్యారేజ్ సెంటర్ చర్చి అభివృద్ధికి రూ.పది వేలు పి.డేనియల్ రాజుకి, సుభలయ చర్చి అభివృద్ధికి రూ.20 వేలు పాస్టర్ జాన్సన్‌కి, పాతపట్నం మండలం తీమర చర్చి అభివృద్ధికి రూ.పది వేలు పాస్టర్ రమేష్‌లకు అందజేశారు. అలాగే మెళియాపుట్టి మండలం మర్రిపాడు కె.మురికింటిభద్ర, గనేపేట, గంగన్నపేట, శేఖరాపురం, కోదుకలిగాం, తంగిని, సంతోష్‌పురం, భావనాపురం కాలనీ, మాకనాపురం, భరణికోట, బాలేరు గ్రామాల్లో 19 చర్చిల అభివృద్ధికి జిఎంఆర్ సభ్యులు ఆయా పాస్టర్లకు రూ.పదేసి వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్సన్, దిలీప్, రమేష్, కోయిలాపు కృష్ణమాచార్య, చవితిసిది మాజీ సర్పంచ్ మిర్యాబిల్లి భగవాన్‌దాస్, తీమర సర్పంచ్ ఇప్పిలి ధనంజయ, పట్టుపురం ఎంపిటిసి ప్రతినిధి నంబాల వెంకటరావు, ఎస్.తిరుపతి, ఆరుబోలు దశరథ, శ్రీధర్, జె.భైరాగి, వాలిపల్లి వెంకటరమణ, సనపల తిరుపతిరావు, కలిశెట్టి వేణుగోపాలరావు, కుంచాల బాలకృష్ణ, యలకల వాసుదేవరావు పాల్గొన్నారు.

పోలాకి: మండల కేంద్రంలోని ఇమాన్యుయల్ చర్చిలో పాస్టర్ తూలుగు సత్య తేజ ఆధ్వర్యంలో క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. క్రీస్తు జననం గురించి వివరించారు. శాంతాక్లాస్, చిన్నారుల వేషధారణలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో బి.రామారావు, ఎం.నీలకంఠేశ్వరరాజు, బి.జనార్ధనరావు, ఎన్.రవి, తదితరులు పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలో వాడవాడలా క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్థానిక మిస్ పాస్కెల్ మెమోరియల్ బాపిస్ట్ చర్చిలో జాన్ ఎడ్వర్డు ఆధ్వర్యంలో, కొత్తపేట, కురుడు, కొత్తపల్లి, తర్లిపేట, దంత, ప్రకాష్‌నగర్ కాలనీల్లో, నిమ్మాడ తదితర చోట్ల క్రైస్తవ సోదరులు చర్చిల్లో ప్రార్థనలు చేశారు. స్థానిక చర్చిలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు ప్రార్థనలు చేశారు.

బాపిస్టు చర్చిలో..

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ, మండలంలో ఉన్న అన్ని చర్చిల్లో ఘనంగా క్రిస్మస్ సంబరాలు జరుపుకున్నారు. పట్టణంలోని గొల్లవీధిలో ఉన్న బాపిస్టు చర్చిలో అధ్యక్షుడు పత్తి విజయకుమార్, ఇతర కార్యవర్గ ప్రతినిధులు అధ్వర్యంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ప్రత్యేక ఆకర్షణగా బొమ్మలు ఏర్పాటు చేశారు. ప్రత్యేక ప్రార్థనలు, ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ సందడిగా క్రిస్మస్ జరుపుకున్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి లివింగ్ స్టోన్ చర్చిలో కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో కిల్లి రామ్మోహనరావు, వైసిపి జిల్లా అధ్యక్షులు చింతాడ మంజు పాల్గొన్నారు.



పలాస : మాట్లాడుతున్న మంత్రి అప్పలరాజు



జలుమూరు : పాగోడులో కేక్‌ను కట్ చేస్తున్న పద్మప్రియ



ఇచ్ఛాపురం : బాపిస్టు చర్చిలో ఆకర్షణగా ఉన్న బొమ్మలు



లావేరు : కేరింతలు కొడుతున్న చిన్నారులు



ఆమదాలవలస : కేకును కట్ చేస్తున్న డాక్టర్ తాతయ్య



మెళియాపుట్టి : నగదు అందజేస్తున్న 'ఎంజిఆర్' సభ్యులు



కోటబొమ్మాళి: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న సర్పంచ్ సంజీవరావు

ఆదర్శప్రాయుడు సీతారాములునాయుడు

మంత్రి ధర్మాన ప్రసాదరావు

పోలాకి: ఆదర్శ ప్రాయుడని కీర్తిశేషులు డోల సీతారాములునాయుడు అని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. ఆదివారం పోలాకిలో సీతారాములునాయుడు కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌తో కలిసి ఆవిష్కరించారు. పూలమాలలు వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రసాదరావు మాట్లాడుతూ సమాజంలో ఒక ప్రత్యేక విలువలు, నీతి, నిజాయితీ, సమాజ హితం కోరే వ్యక్తుల విగ్రహాలు పెడుతుంటారని చెప్పారు. అందులో భాగంగా నా రాజకీయ గురువైన సీతారాములునాయుడు విగ్రహం ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. ఆయన ఆలోచనలు, రాజకీయ చతురత వల్లే ఆ నాటి నుండి నేటి వరకు జాతీయ స్థాయిలో కూడా మన జిల్లాకు, మన నియోజకవర్గానికి మంచి పేరు ఉందని తెలిపారు. ఆయన ఆశయాలు, లక్ష్యాలు సాధించే వరకు అందరం ముందుకు సాగుదామని అన్నారు. ఆ మహనీయులు వేసిన పునాదులే నేడు రాజకీయాల్లో మార్పులు వస్తున్నాయని చెప్పారు. రాజకీయాల్లో మార్పు రావాలంటే సమాజంలో మార్పు రావాలని కోరారు.



సీతారాములునాయుడు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ధర్మాన

అనంతరం విగ్రహ ఆవిష్కరణ ఉత్సవ కమిటీ ఈసర్ల శ్రీధర్‌బాబు ఆధ్వర్యంలో మంత్రి ధర్మాన ప్రసాదరావును సత్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కె.ఎన్ఎ భుక్త, మీసాల నీలకంఠంనాయిడు, డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ముద్దాడ బైరాగినాయుడు, మాజీ డిసిసిబి చైర్మన్ డోల జగన్, డోల తిరుమలరావు, స్థానిక సర్పంచ్ మజ్జి రమణమ్మ, మాజీ ఎంపిపి ప్రతినిధి తమ్మినేని భూషణరావు, ఎంపిటిసి ప్రతినిధి తూలుగు అశోక్‌కుమార్, కణితి కృష్ణారావు, అంధవరపు సూరిబాబు, సురంగి మోహనరావు, జగన్నాథం, ఆర్.త్రినాథరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అధికారులు పాల్గొన్నారు.

తీరంలో సందడే సందడి

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని అక్కుపల్లి శివసాగర్ బీచ్‌లో పర్యాటకులు ఉల్లాసంగా ఆనందంగా గడిపారు. ఆదివారం పెద్ద సంఖ్యలో పర్యాటకులు సాగర తీరానికి చేరుకోవడంతో సందడి నెలకొంది. ఒడిశా సరిహద్దు ప్రాంతాలైన గారబంద, గొప్పిలి, టెక్కలి తదితర ప్రాంతాలు నుంచి యువకులు, విద్యార్థులు, మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాలకు చెందిన వ్యాపారులు, ఉద్యోగులు వారాంతపు సెలవు కారణంగా కుటుంబ సభ్యులతో ఆటవిడుపు కోసం వచ్చారు.

సముద్ర స్నానాలు చేస్తూ పిల్లలతో కేరింతలు కొడుతూ సేదతీరుతూ ఆనందంగా గడుపుతున్నారు. తీరంలో ఖాళీ మద్యం సీసాలు చెల్లా చెదురుగా పడి ఉండడంతో పర్యాటకులు ఇబ్బందులకు గురవుతున్నారు. తీరానికి వచ్చే రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్ సమస్యలు పర్యాటకులకు ఎదురవుతున్నాయి. పర్యాటకులకు ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా మహిళలకు మరుగుదొడ్ల సమస్య వెంటాడుతోంది. గతంలో పర్యాటకశాఖ రెండు షెడ్లు నిర్మించినా నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. బీచ్‌లో పిల్లలకు అవసరమైన ఆట వస్తువులు ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.



కేరింతలు కొడుతున్న పర్యాటకులు

వ్యక్తిగత శుభ్రతపై అవగాహన అవసరం

మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రత పాటించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి అన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని మెప్మా ఆధ్వర్యాన హ్యాండ్ వాష్ కేంద్రాలను ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మహిళా సంఘాలు, ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, నీటి నిర్వహణ, రుతుక్రమ పరిశుభ్రత అంశాలపై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పాటించడం వల్ల ఆరోగ్యంగా ఉండటానికి అవకాశాలు ఎక్కువ ఉంటుందన్నారు. కార్యక్రమంలో మెప్మా మేనేజర్ జానకి రామారావు, వార్డు కౌన్సిలర్లు మధుమూర్తి, సాలీనా ఢిల్లీ, తేజేశ్వరరావు, ప్రకాశ్‌రావు పట్నాయక్, సిఒలు బాలరాజు, సంతోష్, ఆర్‌పిలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



హ్యాండ్ వాష్ కేంద్రాన్ని ప్రాంభిస్తున్న రాజ్యలక్ష్మి

యోగా రాష్ట్ర పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రశంసాపత్రం అందుకుంటున్న ఆశిష్

ప్రజాశక్తి- రణస్థలం

రాష్ట్ర యోగా పోటీల్లో సత్యసాయి విద్యా విహార్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థులు ప్రతిభ చూపారు. గురు, శుక్రవారాల్లో తూర్పుగోదావరి జిల్లా రాయవరంలో ఎస్ఆర్‌జెడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన యోగా పోటీల్లో 13 పూర్వ జిల్లాలకు చెందిన 650 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జిల్లా నుంచి అండర్-14 విభాగంలో మొదటి స్థానంలో సంపతిరావు ఆశిష్, తర్వాత స్థానాల్లో ఇ.చరణ్, జి.దీక్షిత్, టి.జానకిరామ్ నిలిచారు. వీరు రాష్ట్ర పోటీల్లోనూ టాప్ 15లో నిలిచారని కోచ్ కిరణ్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపిన నలుగురు విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర పరిశీలకులు టి.పూర్ణచందర్, యోగా రాష్ట్ర రిసోర్స్‌పర్సన్ బి.శంకరరావు ప్రశంసాపత్రాలు అందజేశారు. తక్కువ సమయంలోనే ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను చైర్మన్ మళ్లా రామేశ్వర్‌గౌడ్, ప్రిన్సిపాల్ ప్రీతిచౌదరి, మేనేజర్ అనుదీప్ అభినందించారు.

సందడిగా శార్వాణి సిల్వర్‌జూబ్లీ వేడుకలు

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బొరివంక గ్రామానికి చెందిన శార్వాణి గ్రామీణ, గిరిజన సాంస్కృతిక సేవా సంఘం సిల్వర్ జూబ్లీ వేడుకలు పుక్కల్లపాలెం సముద్ర తీరంలో ఆదివారం సందడిగా జరిగాయి. మూడు జిల్లాలకు చెందిన సుమారు 60మంది కళాకారులు తమ అనుభవాలు, అనుభూతులు పంచుకున్నారు. కళారంగంపై తమకు ఉన్న మక్కువ వెళ్లబుచ్చారు. రోజురోజుకూ కనుమరుగవుతున్న కళా రంగానికి వెన్నుదన్నుగా నిలిచి, తమ ఈ ప్రయాణంలో ఆదరించి, అండదండగా నిలిచిన భైరిపురం గ్రామానికి చెందిన సనపల శ్రీనుని సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. అందరూ కలిసి ఆడారు.. పాడారు. ఆత్మీయ కలయికను హృదయంలో పదిలపరచుకున్నారు.



సనపల శ్రీనుని సన్మానిస్తున్న శార్వాణి బృందం

రాజపురంలో..

రాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1996 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఆడారు.. పాడారు. ఆనాటి మధుర స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యా బుద్ధులు చెప్పిన గురువులను సన్మానించి ఆశీసులు అందుకున్నారు.

పింఛన్లు ఇస్తే జీతాలు ఉండవు

- రాష్ట్రంలో అధ్వానంగా వైసిపి పాలన
- టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి పరిపాలన అధ్వానంగా ఉందని, అధికారులకు జీతాలు ఇస్తే పింఛన్లు ఇచ్చే పరిస్థితి లేదని, ప్రభుత్వ పథకాలు ఇస్తే ఆ నెల జీతాలు చెల్లించే పరిస్థితి లేదని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష వైసిపి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పలాస -కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో 22, 23 వార్డులో ఆదివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఇష్టానుసారంగా విద్యుత్ ఛార్జీలు పెంచుతోందన్నారు. అధికారం చేపట్టిన వెంటనే మద్యపానం నిషేధం చేస్తానని చెప్పి మద్యం ధరలను మూడు రెట్లు పెంచి 30ఏళ్ల పాటు రాష్ట్రాన్ని తాకట్టుపెట్టే పరిస్థితి జగన్మోహన్‌రెడ్డి తీసుకొచ్చారని విమర్శించారు. విశాఖపట్నంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు 20వేల ఎకరాలను ఆక్రమించారని ఆరోపించారు.

వైఎస్ఆర్ చేయూత పథకం పేరుతో అత్తకు వస్తే కోడలకు రావడంలేదని, తల్లికొస్తే కూతురు ఇచ్చే పరిస్థితి లేదని, గతంలో టిడిపి అధినేత చంద్రబాబునాయుడు పసుపు కుంకుమ పేరుతో ప్రతి మహిళకూ నేరుగా బ్యాంకుఖాతాలో డబ్బులు జమచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రభుత్వ పాఠశాలలకు పైపై పనులు చేసి రంగులు వేస్తూ నాడు నేడు పేరుతో అభివద్ధి చేస్తున్నామని వైసిపి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారం చేపడుతుందని, ప్రజలకు మంచి పరిపాలన అందించి రాష్ట్రాన్ని బాగు చేసే పనిని చంద్రబాబునాయుడు తీసుకున్నారని, అందుకు ప్రతి ఒక్కరూ టిడిపి పార్టీకి సహకారం అందించాలని కోరారు. ముందుగా ఆయా వార్డు పరిధిలో పర్యటించి వైసిపి ప్రభుత్వం చేపడుతున్న అక్రమాలను, పరిపాలన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించారు కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబురావు, టిడిపి రాష్ట్ర బిసి సెల్ ప్రధాన కార్యదర్శి లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, వార్డు కౌన్సిలర్ జ్యోతినాయక్, కృష్ణ నాయక్, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు, సప్ప నవీన్, పాండు, టిడిపి నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



పలాస : మాట్లాడుతున్న గౌతు శిరీష



టెక్కలి రూరల్ : ధర్నా చేస్తున్న టిడిపి నాయకులు

టెక్కలి రూరల్ : మండలంలోని పోలవరంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరిరావు ఆధ్వర్యాన ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్, మట్ట పురుషోత్తం, కోళ్ల కామేష్, మెండ దమయంతి పాల్గొన్నారు.

సంఘ అభివృద్ధికి సహకారం




మాట్లాడుతున్న జెడ్‌పి చైర్‌పర్సన్ విజయ

ప్రజాశక్తి - ఇచ్ఛాపురం

జిల్లాలో చాత్తాద శ్రీ వైష్ణవ సంఘం అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. పట్టణంలోని మున్సిపల్ టూరిజం పార్కులో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో సంఘ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలు సమస్యలు పరిష్కారం కోసం ఆమెకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ లాభాల స్వర్ణమణి, ఎంపిపి బి.పుష్ప, వైష్ణవ కార్పొరేషన్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ నాయకులు మనోజ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు, డైరెక్టర్ కేశవపట్నం హరినారాయణ, బాలగోపాలరావు, పెద్దబాబు, శ్యాంసుందర్, సోమేశ్వరరావు, నారాయణరావు, శ్రీనివాసరావు, రామకృష్ణ, శివకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనులు పరిశీలన

ఆమదాలవలస : ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీలు బాధ్యతతో నాడు-నేడు కార్యక్రమాలు విజయవం తమవుతుందని మండల విద్యా సంక్షేమ అధికారి పైడి కూర్మారావు అన్నారు. మండలంలోని అక్కివరం పంచాయతీ పరిధిలోని గోపీనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులను తల్లిదండ్రుల కమిటీతో కలిసి శనివారం పరిశీలించారు. ప్రభుత్వం పాఠశాలకు అందిస్తున్న రివాల్వింగ్ ఫండతో పాటు గ్రామస్తుల్లో పెద్దలు, విశ్రాంతి ఉద్యోగులు సమన్వయంతో చక్కగా నిర్మించు కుంటున్నట్లు తెలిపారు. మన పాఠశాల మన ఆస్తి, మన పిల్లలకే ఉపయోగం అన్న భావనతో పనులు చేపతున్నామని వివరించారు.



పనులను పరిశీలిస్తున్న కూర్మారావు

కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్ రమణ, గ్రామ సంఘం అధ్యక్షులు రేణుక, విశ్రాంత వ్యవసాయాధికారి పూజారి బాలకృష్ణ, గ్రామ సంఘం విఒఎ రాజేశ్వరి, అంగన్వాడీ కార్యకర్త లత పాల్గొన్నారు.



సాయిరాజ్ దంపతులను సత్కరిస్తున్న కుల పెద్దలు

కళింగుల సంక్షేమానికి కృషి

సోంపేట : కళింగుల సంక్షేమానికి కృషి చేస్తామని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, సాయిరాజ్ అన్నారు. మండలంలోని బారువ తీరంలో ఆదివారం నిర్వహించిన కళింగ కుల వన భోజనాల్లో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, డాక్టర్ పి.శివాజీ, సోంపేట ఎంపిడిఒ బి.వెంకటరమణ సాయిరాజ్ దంపతులను సత్కరించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో కళింగ కుల పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పిసిసి అధ్యక్షుడు పర్యటన

టెక్కలి : ఎపి కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి గిడుగు రుద్రరాజు సోమవారం టెక్కలి రానున్నారని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా అధికార ప్రతినిధి పేడాడ పరమేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. మధ్యాహ్నం 3 గంటలకు మండలంలోని పాత నౌపడా వద్ద ఉన్న విహంగం కార్యాలయంలో నిర్వహించే విద్యార్థి, యువజన, సంఘాల సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు. పిసిసి అధ్యక్షునిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా జిల్లాకు రానున్న రుద్రరాజు పర్యటనను విజయవంతం చేయాలని కోరారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న సర్పంచ్ తదితరులు

పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యం

కోటబొమ్మాళి : మేజరు పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ కె.సంజీవరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శి రఘుపాత్రుని యోగేశ్వరరావు ఆధ్వర్యంలో చేపట్టిన పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు తడి, పొడి చెత్తను సేకరించి డంపింగ్ చేస్తున్నట్లు తెలిపారు. నిత్యం పారిశుధ్య కార్మికులు పంచాయతీలోని అన్ని వీధులను శుభ్రం చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైసిపి నాయకులు కె.అప్పలరాజురెడ్డి, గోవిందరావు, ఇర్రి చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

నేడు కలెక్టరేట్ వద్ద ధర్నా

టెక్కలి : ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు గున్న ప్రసాదరావు ఒక ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బకాయిపడిన డిఎలను విడుదల చేయాలన్నారు. కొత్త డిఎలను ప్రకటించాలన్నారు. 1వ తేదీనే జీతాలు చెల్లించాలన్నారు. పాఠశాలల విలీనాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నేడు బైక్ వేలం

ఆమదాలవలస : మద్యం అక్రమ దాడుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాన్ని సోమవారం కార్యాలయం వద్ద వేలం వేయనున్నట్లు ఎస్ఇబి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.సునీల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డిప్యూటీ కమిషనర్ ఆదేశాల ప్రకారం గతేడాది పట్టుబడిన వాహనాల్లో ఒక ద్విచక్ర వాహనాన్ని వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వారు నిబంధనల ప్రకారం రూ.వెయ్యి ఫీజు కట్టి ఆధార్ కార్డుతో వేలం పాటకు హాజరు కావాలని తెలిపారు.



నిల్వ ఉన్న మురుగునీరు

అన్నంపేటలో అపారిశుధ్యం

బూర్జ: మండలంలోని అన్నంపేటలో మురుగు కంపుతో గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. గ్రామంలోని వీధుల్లో ఇరువైపులా కాలువలు లేకపోవడంతో మురుగు నీరు రహదారులపై నిల్వ ఉండిపోతుంది. దీంతో దుర్గంధం వేదజల్లడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా గ్రామంలో చెత్త కుప్పలు పేరుకుపోవడంతో వ్యాధులు ప్రబలుతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము తాగునీటి కోసం ఆధారపడిన తాగునీటి బావుల వద్ద కూడా మురుగునీరు నిల్వ ఉండిపోవడంతో వ్యాధుల బారిన పడుతున్నామని వాపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకుండాపోయిందని ఆరోపించారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టి మురుగు సమస్యను పరిష్కరించాలని, కాలువలను నిర్మించాలని కోరుతున్నారు.

మాజీ సైనికుల సంక్షేమమే లక్ష్యం

శ్రీకాకుళం అర్బన్ : దేశ సమగ్రతను కాపాడే గురుతర బాధ్యతలను నిర్వర్తించే విధుల్లో భాగంగా సరిహద్దుల్లో అనేక పోరాటాల్లో పాల్గొని విశ్రాంత జీవనం గడుపుతున్న మాజీ సైనికులు, వీరోచిత పోరాటాల్లో ప్రాణాలు పోగొట్టుకున్న సైనికుల కుటుంబ సభ్యుల సంక్షేమానికి మాజీ సైనికుల సమాఖ్య ఎల్లప్పుడూ పనిచేస్తుందని ఆ సంఘం అధ్యక్షులు కటకం పూర్ణచంద్రరావు తెలిపారు. నగరంలోని జిల్లా సైనిక సంక్షేమ భవనం ఆవరణలో ఆదివారం సంఘం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంఘానికి నిరంతరంగా సహకారాన్ని అందిస్తున్న మాజీ సైనికులకు, వారి కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. సమాఖ్య చైర్మన్ కెప్టెన్ ఈశ్వరం రావు, గౌరవ అధ్యక్షులు ఎస్.ఎస్.ఎల్.మూర్తి, ఇసిఎచ్ఎస్ అధికారి విశ్రాంత కల్నల్ ఎం.నారాయణరావు, సైనిక సంక్షేమ కార్యాలయం జిల్లా సూపరింటెండెంట్ ఎస్.ఈశ్వర రావు, మహిళా సెక్రటరీ పి.పద్మావతి పాల్గొన్నారు.

తక్కువ ధరలకు ఫైబర్‌నెట్

శ్రీకాకుళం అర్బన్ : ఎపి ఫైబర్‌నెట్ ద్వారా మారుమూల గ్రామాలకు తక్కువ ధరలో ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్టు జిల్లా మార్కెటింగ్ మేనేజర్ లోకనాథం గౌతంకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి ఫైబర్ నెట్ నెలకు రూ.190 చెల్లిస్తే 20 ఎంబిపిఎస్ స్పీడ్‌తో 400 జిబి రూ.249కి 50 ఎంబిపిఎస్ స్పీడ్‌తో ఆన్ లిమిటెడ్ నూతన ప్యాకేజీలను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలానే వచ్చే ఏడాది జనవరి 6 నుంచి ఎపిఎస్ ఎఫ్ఎల్ బిల్లింగ్ విధానం పోస్టుపెయిడ్ నుంచి ప్రీ పెయిడ్‌లోకి మారుతుందని తెలిపారు.

జంగిల్ క్లియరెన్స్ చేయరూ..



పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బెండి-కొండవూరు రోడ్డు పరిధిలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డుకి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు రోడ్డుని ఆక్రమించాయి. దీంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. జంగిల్ క్లియరెన్స్ లేకపోవడంతో తరచూ బెండి-కొండవూరు మధ్యలో రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు మలుపులు వద్ద ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాలకు గురవుతున్నారు. గత నెలలో బెండి నుండి కొద్ది దూరం వరకు మాత్రమే జంగిల్ క్లీరెన్స్ చేపట్టారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేయాలని వారు కోరుతున్నారు.

గుర్తిస్తేనే మా మద్దతు

యాదవ గర్జన మహాసభలో స్పష్టీకరణ

ప్రజాశక్తి- కంచిలి

అన్ని రాజకీయ పార్టీలు యాదవ సామాజిక వర్గాన్ని గుర్తించి, తగిన ప్రాధాన్యత ఇస్తేనే రాబోయే ఎన్నికల్లో తమ మద్దతు ఉంటుందని యాదవ కుల సంఘం నాయకులు స్పష్టం చేశారు. కంచిలి రాధాకృష్ణ మందిరం ఎదురుగా ఆదివారం జిల్లా యాదవ ఐక్యవేదిక ఆధ్వర్యంలో యాదవ గర్జన మహాసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఐక్యవేదిక సభ్యులు నర్తు రామారావు, నర్తు నరేంద్ర యాదవ్, కె.ప్రకాష్ మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో యాదవులకు రెండు అసెంబ్లీ స్థానాలు కేటాయించాలని, స్థానిక ఎన్నికలు ఎప్పుడు జరిగినా ఐదు ఎంపిపి స్థానాలను, ఐదు జెడ్‌పిటిసి స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. ఒక మున్సిపల్ చైర్మన్, జెడ్‌పి లేదా, డిసిఎంఎస్, కార్పొరేషన్ డైరెక్టర్ల నియామకాల్లో యాదవులకు తగిన గుర్తింపు ఇవ్వాలన్నారు



యాదవ గర్జనలో అభివాదం చేస్తున్న నాయకులు

రాజకీయాలకు అతీతంగా ఐక్యవేదిక ఆధ్వర్యంలో యాదవుల అభివృద్ధి లక్ష్యంగా కృషి చేస్తామన్నారు. అన్ని రాజకీయ పార్టీలూ యాదవుల సామాజిక తరగతికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే తమ పూర్తి మద్దతు, సహకారం ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జిల్లాకు చెందిన యాదవ కుల సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

అప్పన్న సేవలు మరువలేనివి

ప్రజాశక్తి- టెక్కలి

తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షునిగా సేవలందించిన కోళ్ల అప్పన్న సేవలు ప్రస్తుత యువతరానికి ఆదర్శప్రాయమని మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో అప్పన్న వర్ధంతి వేడుకలు ఆదివారం నిర్వహించారు. ముందుగా అప్పన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో హనుమంతు రామకృష్ణ, పట్టణ ఆధ్యక్షులు కోళ్ల లవకుమార్, మామిడి రాము, పొలాకి షణ్ముఖరావు, మట్ట పురుషోత్తం, బెహరా కాళి, మెండ దమయంతి, మల్లా బాలకృష్ణ, రెయ్యి ప్రీతీష్ చంద్, దల్లి ప్రసాద్‌రెడ్డి, పేర మురళి, పెదరట్టి మణి పాల్గొన్నారు.

టెక్కలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 1983-84లో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యాన అప్పన్న వర్ధంతి వేడుకలు నిర్వహించారు. రాజకీయాల్లో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తున్న తరుణంలో సమాజానికి దూరంగా వెళ్లిపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం నాయకులు వైకుంఠరావు పాణిగ్రాహి, హనుమంతు ఉదయ్‌భాస్కర్, దుంపా శ్రీనివాస్, చింతాడ రవికుమార్, ముడిదాన ఆనంద్‌కుమార్, నెక్కంటి లక్ష్మణరావు, లాడి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రూ.10వేలు ఆర్థికసాయం

కోటబొమ్మాళి: స్థానిక మేజరు పంచాయతీలోని వైశ్యవీధిలో నివాసముంటున్న ఎం.నాగమణికి అదే గ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త తాళాసు కృష్ణారావు రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందజేశారు. ఆమె ఇంటి నిర్మాణం కోసం డబ్బులు సరిపోక ఇబ్బంది పడుతోంది. ఆమె ఇబ్బందిని గుర్తించిన కృష్ణారావు ఆమెకు ఆర్థిక సాయం అందించి, ఉదారతను చాటుకున్నారు. తన లాగే దాతలు ముందుకొచ్చి సాయం చేస్తే ఆమెకు సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు.



ఆర్థికసాయం చేస్తున్న కృష్ణారావు



వాజ్‌పేయి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కణితి విశ్వనాథం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ సంత మైదానంలో మాజీ ప్రధాని అటల్ బీహార్ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన విగ్రహాన్ని మాజీ ఎంపీ కణితి విశ్వనాథం ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో నాలుగులైన్ల జాతీయ రహదారిని నిర్మించిన వ్యక్తి వాజ్‌పేయి అని కొనియాడారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు పాలవలస వైకుంఠరావు, సనపల సంగంనాయుడు, అట్టాడ రవిబాబు, రౌతు చిరంజీవి, కొర్రాయి బాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

నివాళి

రణస్థలం రూరల్ : మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి జయంతిని మండలంలోని నడుకుదిటిపాలెంలో బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నడుకుదిటి ఈశ్వరరావు క్యాంపస్ వద్ద సుపరిపాలన దివస్‌ను నిర్వహించారు. తొలుత వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో ఎంపిటిసి టొంపల సంజీవరావు, టి.అప్పలరాజు, జి.త్రినాథరావు, వెలిచేటి రామకృష్ణ, కామేశ్వరరావు, గోపిన కృష్ణారావు, గొర్లె శ్రీహరి, మన్నె కోటేశ్వరరావు, జి.గణేష్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మాజీ ప్రధానమంత్రి వాజ్‌పేయి జయంతి వేడుకలను జిల్లా ప్రధాన కార్యదర్శి సలాన రాఘవరావు, స్టేట్ కౌన్సిల్ మెంబరు రమేష్ నిర్వహించారు. అనంతరం వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు.



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

అల్లివలసలో గడప గడపకు...

ప్రజాశక్తి- రణస్థలం

మండలంలోని అల్లివలసలో ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ గడపగడపకు-మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించారు. అనంతరం మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రతినిధి లంకలపల్లి ప్రసాద్, వైసిపి మండల అధ్యక్షులు మహంతి పెద్దరామునాయుడు, వైస్ ఎంపిపిలు మైలపల్లి కామరాజు, రాయపురెడ్డి బుజ్జి, పైడిభీమవరం పిఎసిఎస్ చైర్మన్ గొర్లె తిరుపతిరావు, సర్పంచ్ చీకటి యర్రమ్మ, ఇన్‌ఛార్జి ఎంపిడిఒ ధనుంజయరావు, అంగన్వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల స్వీకరణ

పలాస: కాశీబుగ్గ ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో రెండు అంగన్వాడీ, 9 అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు కాశీబుగ్గ ఐసిడిఎస్ పిఒ డి.శార్వాణి తెలిపారు. కొతూరు మండలం బాతుపురం, యూజి.పురం అంగన్వాడీ టీచర్లు, పుత్తూరు మండలం చిన్న డోకులపాడు, సైనూరు, పల్లివూరు, నందిగామ మండలం కనితిఊరు అనంతపురం దేవపురం కాశీబుగ్గ, పలాస మున్సిపాలిటీ పరిధిలో రెండవ వార్డు సాయిబుల కాలనీ అంగన్వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఆమె తెలిపారు. డిసెంబర్ 31వ తేదీ వరకు దరఖాస్తులు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ విషయాన్ని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు గమనించాలని కోరారు.



పనులను పరిశీలిస్తున్న జెఇ నాయుడు

బోర్ల పనులు ప్రారంభం

బూర్జ: మండలంలోని కాలపర్తి పంచాయతీ పరిధిలో ఉన్న అనుమయ్యపేట, తోటవాడ గ్రామాల్లో ఆదివారం బోర్ల పనులు ప్రారంభించారు ఒక్కొక్క బోరుకు రూ.ఆరు లక్షలు చొప్పున జెడ్‌పి నిధులు మంజూరయ్యాయయని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ ఎం.వి.కె.నాయుడు తెలిపారు. మండలంలోని గ్రామాల్లో రానున్న కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా చేసేందుకు సమస్యలను గుర్తించి బోర్లను ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాలపర్తి, తోటవాడ సర్పంచ్‌లు వరహాలనాయుడు, సూర ఆనంద్, మామిడివలస ఎంపిటిసి గుమ్మడి రాంబాబు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణ 'రక్షణ'

కవిటి: మనం చేసే రక్త దానం మరొకరి ప్రాణానికి రక్షణ కల్పిస్తుందని రక్షణ ఫౌండేషన్ చైర్మన్ లండ ధర్మరాజు అన్నారు. మండలంలోని కళింగపట్నం గ్రామంలోని ఆంధ్ర బాపిస్ట్ చర్చిలో రక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. తలసేమియా వ్యాధిగ్రస్త పిల్లల కోసం ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో సుమారు 40మంది యువత రక్త దానం చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ లండ ధర్మరాజు, విస్వేశ్, కాళీ సాహు, బ్లడ్ బ్యాంకు మేనేజర్ సాయి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు